క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా


ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపో కండక్టర్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ పట్టణంలో శనివారం ఆర్టీసీ ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలతో ధర్నా చేశారు. ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో డిపో గేట్ వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ ఎస్వీ రమణను 1/2009 సర్క్యులర్‌కు విరుద్ధంగా సస్పెండ్ చేశారన్నారు. రమణను విధుల్లోకి తీసుకునే వరకూ ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో కార్యదర్శి టి.త్రిమూర్తులు, ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్, యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎస్పీ రావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

యూత్ లీడర్‌షిప్‌పై వర్క్‌షాపు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శనివారం రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో యూత్ లీడర్‌షిప్‌పై వర్క్‌షాప్ నిర్వహించినట్టు డిప్యూటీ ప్రోచాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. వికసిత్ భారత్‌లో భాగంగా విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. రిటైర్డ్ లెక్చరర్, మోటివేషనల్ స్పీకర్ సలాది శ్రీరామ చంద్రమూర్తి, పెద్దాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్ ఆర్.అంకబాబు ముఖ్య అతిథులు హాజరయ్యారు. నాయకత్వం, ప్రేరణ, దేశ నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ ఎస్. రమాశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ క్యాంపస్‌లో గ్రూప్–2 పరీక్షా కేంద్రాలను శనివారం పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి పరిశీలించారు. కేంద్రాలను తనిఖీ చేసి విద్యార్థులకు కల్పించే వసతులపై ఆరా తీశారు. మొత్తం 6460 మంది విద్యార్థులు గ్రూప్ పరీక్షలు రాస్తున్నట్టు తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

'ఎక్సైజ్ అసోసియేషన్' అధ్యక్షుడిగా శివప్రసాద్

ప్రత్తిపాడు: కాకినాడలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో శనివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘ జిల్లా అధ్యక్షుడిగా ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి. శివప్రసాద్, కోశాధికారిగా ప్రత్తిపాడు ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ ఎన్నికయ్యారు. పీఎస్ వెంకటేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు, కోశాధికారులుగా ఎన్నికైన శివప్రసాద్, వంశీరామ్‌లను స్థానిక ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్లు శివకుమార్, మల్లిఖార్జున, మహేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లు, సిబ్బంది అభినందించారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

కిర్లంపూడి: జ్ఞానజ్యోతి శిక్షణలో నేర్చుకున్న బోధనా పద్ధతులను అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని ఎంఈఓ–2 ఎం.చిన్నారావు సూచించారు. స్థానిక కొక్కొండ రామశేషగిరి పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో ఐసీడీఎస్, విద్యాశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా నాల్గో రోజు శనివారం టీఎల్ఎం తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–1 జోసెఫ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుంచి 6 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ ప్రకాశరావు, డీఆర్పీలు ఎస్.సాయికృష్ణ, ఆర్.జయశ్రీ, పి.వరలక్ష్మి, పి.భూసమ్మ, కరీమున్నీషా పాల్గొన్నారు.

పీఎంఏవై లబ్ధిదారుల గుర్తింపుపై సమీక్ష

రౌతులపూడి: మండలంలోని ప్రధానమంత్రి ఆవాస యోజన పథకంలో లబ్ధిదారుల వివరాలపై శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పెద్దాపురం హౌసింగ్ ఈఈ కేవీఆర్ గుప్తా, ప్రత్తిపాడు హౌసింగ్ డీఈ సువర్ణరాజు తహసీల్దార్ నరేష్, ఇతర అధికారులతో సమీక్షించారు. మండలంలో పీఎంఏవై పథకంలో గుర్తించిన 808 మంది లబ్ధిదారుల వివరాలను సేకరించి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్ నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ నేత, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు శనివారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఒమ్మంగిలో కొప్పన బాబూరావు భార్య, వేములపాలెంలో చందక నాని తండ్రి కృష్ణ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను మురళీరాజు పరామర్శించారు. పోతులూరులో ఇందన రాము, వల్లు సత్తిబాబు కుమారుడు లోవరాజు, ముప్పిడి అర్జునుడు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను పరామర్శించి ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మాకా చంటిబాబు, లొండ బాబు, దేవ లక్ష్మణ్, ముప్పిడి ఏసుబాబు, శెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్టు వెలవెల

- నష్టాల బాటలో పయనం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- అవినీతి ఆరోపణలపై విచారణ


సరకులు, వినియోగదారులు లేక వెలవెలబోతున్న మహిళా మార్టు

కిర్లంపూడి: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఏర్పాటు చేసిన మహిళా మార్టు వెలవెలబోతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో డ్వాక్రా సంఘాల్లోని మహిళల భాగస్వామ్యంతో కిర్లంపూడిలో మహిళా మార్టును ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 2,976 స్వయం సహాయక సంఘాల్లో 20,760 మంది సభ్యులు ఉన్నారు. స్థానిక పాత వెలుగు కార్యాలయానికి మార్పులు, చేర్పులు చేసి అందులో సెర్ప్, చేయూత, విభాగాల సహాయంతో మహిళా సంఘాల వాటా రూ.41.52 లక్షలతో మహిళా మార్టును ఏర్పాటు చేశారు. దీనిని 2023 మార్చి 31న అప్పటి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా ప్రారంభించారు.

నెల రోజులకే మంచి ఫలితాలు

మార్టు ఏర్పాటు చేసిన నాటి నుంచి రోజుకు సుమారు రూ.85 వేలు వరకూ అమ్మకాలు జరిగాయి. నెలకు రూ.25,87000 వ్యాపారం జరిగేది. మహిళా సంఘాల సభ్యుల పిల్లలు 8 మందిని మార్టులో పనిచేసేందుకు సేల్స్‌గరల్స్‌గా నియమించారు. మహిళా సంఘాల నుంచి మరో పది మందిని కమిటీగా ఏర్పాటు చేశారు. వారిలో కొంతమందిని ప్రమోటర్లగా నియమించి మార్టు పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేవారు. దీంతో మార్టు లాభాల బాటలో నడిచింది.

సమన్వయం లోపించడంతో..

గతేడాది జరిగిన సార్వత్రిక తర్వాత సమన్వయ లోపంతో మార్టుపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. మార్టులోని సరకులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో వినియోగదారులు మార్టు వంక కన్నెత్తి చూడడం లేదు. ప్రస్తుతం మార్టు వ్యాపారం రోజుకు రూ.900 నుంచి రూ.1000కి పడిపోయింది. సరకులు ఎందుకు తీసుకురావడం లేదని అధికారులను అడగ్గా మార్టుకు సరకులు పంపించే ఏజెన్సీకి సుమారు రూ.3 లక్షలు బకాయి పడడంతో సరకులు నిలిపివేశారని సమాచారం.

సిబ్బంది తొలగింపు

వ్యాపారం లేక ఆదాయం పడిపోవడంతో మార్టులో పనిచేసే సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఐదుగురు సెల్స్‌గారల్స్, మేనేజర్, సెక్యూరిటీ సిబ్బందిని తొలగించారు.

వెలుగులోకి అవకతవకలు

మార్టులో రూ.6.53 లక్షల అవకతవకలు జరిగినట్లు ఉన్నతాధికారులకు సమాచారం వెళ్లడంతో గత మంగళవారం సర్ప్ డీపీఎం బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కిర్లంపూడి వెలుగు కార్యాలయంలో సిబ్బంది, వీఓఏలతో విచారణ నిర్వహించారు. ఈ విచారణలో ఎటువంటి బ్యాంక్ లావాదేవీలు జరగకుండా 18 మంది వీఓఏలు మార్టులో రూ.6.53 లక్షల విలువగల సరకులు అరువు తీసుకెళ్లినట్టు గుర్తించారు. వారి నుంచి డబ్బులు రికవరీ చేస్తామన్నారు. పలువురు వీఓఏలు స్పందిస్తూ తాము కొనుగోలు చేసిన దానికంటే ఎక్కువ బాకీ తమపై ఉన్నట్లు చూపిస్తున్నారని ఆరోపించారు. దీనిపై త్వరలో ఉన్నతాధికారులతో క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపడతామని వెంకటేశ్వరరావు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం

డ్వాక్రా మహిళల సొమ్ము రూ.41.52 లక్షలతో మార్టును ప్రారంభించారు. వారి డబ్బుతో నిర్వహించే మార్టులో వచ్చిన లాభనష్టాలు నెలకొకసారి లేదా ఏడాదికి ఒకసారైనా ప్రతి సభ్యురాలికి చెప్పవలసిన అవసరం అధికారులు, కమిటీ సభ్యులపై ఉంది. వారి డబ్బులతో మార్టు ప్రారంభించడమే వారికి తెలుసు తప్ప నెలకు ఎంత ఆదాయం వస్తుంది, ఎంత ఖర్చు అవుతుంది అనే విషయాలు డ్వాక్రా మహిళలకు తెలియవు. అసలు మార్టు లాభాల్లో ఉందో అప్పుల్లో కూరుకుపోతుందో అనే విషయం కూడా వారికి తెలియని పరిస్థితి. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి మార్టులోని లోపాలను సరిదిద్ది పూర్తి స్థాయిలో వినియోగదారులకు సరకులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కిర్లంపూడిలో చేయూత మహిళా మార్టు


ఖాళీగా దర్శనమిస్తున్న బియ్యం, పప్పు డబ్బాలు

పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు చర్యలు



మార్టుకు సరకులు పంపించే ఏజెన్సీకి సుమారు రూ.3 లక్షల వరకూ బకాయిలు ఉండడంతో సరకులు నిలిపివేశారు. మార్టుకు వీఓఏల నుంచి రావలసిన డబ్బులు రికవరీ చేసి త్వరలోనే పూర్వవైభవం తీసుకువస్తాం.

– బంతు వెంకటేశ్వరరావు, సెర్ప్ పీడీఎం

కల్యాణ అలంకరణలో స్వామి, అమ్మవార్లు


సిరిపురంలో పెండ్లి కుమారుడు, పెండ్లికుమార్తెగా స్వామిఅమ్మవార్లు

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి, అమ్మవార్లు పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలోని పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు వై.రామకృష్ణమూర్తి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ నెల 23న స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. 26న మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి లింగోద్భవ కాల పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 27న గ్రామోత్సవం, పండిత సదస్యం, 28న త్రిశూల స్నానం, శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

రౌతులపూడి: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి అధికారులను ఆదేశించారు. రౌతులపూడి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సేవలు, రీ సర్వే పురోగతిపై అధికారులతో సమీక్షించారు. రీ సర్వే త్వరితగతిన పూర్తి చేసి గ్రామాల్లోని భూ వివాదాలను పరిష్కరించాలని సూచించారు. విధులకు సకాలంలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, వీఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేపూడి శ్యాంబాబు

ప్రత్తిపాడు రూరల్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కొండెపూడి శ్యాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని రాచపల్లి అడ్డురోడ్డు వద్ద ధర్మవరం మాజీ సర్పంచ్ కాపారపు రాజబాబు అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆగస్టు 1న అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా రాష్ట్రంలో ఇప్పటికే ఎస్సీ వర్గీకరణను పూర్తి చేయలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం వర్గీకరణ పూర్తి చేసిందని, ఏపీలోని కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. కమిషన్ పేరుతో కాలయాపన చేయకుండా ఎస్సీ వర్గీకరణను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ కోరుతూ మార్చి 19న ధర్మవరం నుంచి ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మాదిగలు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల ఎమ్మార్పీఎస్ నాయకులు కె.రాజబాబు, దూలపల్లి నాని బాబు, గెడ్డం పెద్దిరాజు, కొమ్ముకూరి సత్యనారాయణ, మోర్త సత్తిబాబు, కాపారపు నూకరాజు, బోడపాటి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు చంద్రబాబు వంచన

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శివమణి


మాదిగలతో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శివమణి

తుని రూరల్: మాదిగలను చంద్రబాబునాయుడు మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పలివెల శివమణి ఆరోపించారు. శనివారం తుని మండలం లోవకొత్తూరులో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మార్చి 15న గన్నవరంలో ధర్మ పోరాట బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. లక్ష గొంతులు, వేల డప్పులతో దండోరా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. మాదిగలను చైతన్యపర్చేందుకు మొదటగా తుని మండలం లోవకొత్తూరు నుంచి గ్రామాల పర్యటన ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ ఇప్పటికే వర్గీకరణ చేసిందన్నారు. ఏపీలోనూ సీఎం చంద్రబాబు వర్గీకరణ బిల్లును రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి దండోరా కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మార్లపూడి రాజు, గంటేటి లోవరాజు, చిందాడ నాగేశ్వరరావు, తాతపూడి శ్యామ్ పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వెంకటనారాయణ శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై చర్చిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం


సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున రత్నగిరిపై పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. అలాగే ఇతర ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నవదంపతులు, వారి బంధుమిత్రులతో కలిసి సత్యదేవుని వ్రతాలాచరించారు. స్వామివారిని దర్శించి పూజలు చేశారు. దీంతో ఆలయం వద్ద రద్దీ నెలకొంది. సత్యదేవుని దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుడిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారిని సుమారు 40 వేల మంది భక్తులు దర్శించగా 2,500 వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకార సేవ

రత్నగిరిపై శనివారం సత్యదేవుని ప్రాకారసేవ ఘనంగా జరిగింది. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి తిరుచ్చి వాహనంపై ప్రతిష్ఠించారు. స్వామి, అమ్మవార్లకు పూజలు చేసిన అనంతరం ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు కొబ్బరికాయ కొట్టి ప్రాకారసేవ ప్రారంభించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ మూడు సార్లు ఆలయ ప్రాకారంలో సేవ నిర్వహించారు. అనంతరం పండితులు స్వామి, అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు స్వామివారి ఊరేగింపు

రత్నగిరిపై రామారాయ కళావేదిక మీద ఆదివారం సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, నమస్కారాలు నిర్వహించనున్నారు. ఉదయం పది గంటలకు టేకు రథంపై స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రాకారంలో ఊరేగించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.


తిరుచ్చి వాహనంపై సత్యదేవుని ప్రాకార సేవ

పంట నమోదు వేగవంతం చేయాలి

శంఖవరం: రబీ పంట నమోదు వేగవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సిబ్బందికి సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ సహాయకులతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రబీలో సాగు చేస్తున్న వరి, అపరాల పంటలు, కౌలు రైతుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. వరిలో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంట కోత ప్రయోగాలు, పీఎం కిసాన్, పొలంబడి, జాతీయ ఆహార భద్రత మిషన్, పంటల బీమా తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

తొండంగి: గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీడీ విజయకుమారి శనివారం తనిఖీ చేశారు. ఎస్సీపేట, బీసీకాలనీ తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పోషణవాటిక సక్రమంగా నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు రేషన్ అందించడంతో పాటు పోషణ వాటికలను సక్రమంగా నిర్వహించాలని అంగన్‌వాడీలను ఆదేశించారు. ఎప్పటికప్పుడు సెక్టార్ సూపర్‌వైజర్లు పరిశీలించి తమకు నివేదిక అందించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తల్లీకూతుళ్ల అదృశ్యంపై కేసు

తొండంగి: తల్లీకూతుళ్ల అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఒంటిమామిడి పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ పాండురంగ శనివారం రాత్రి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ప్రత్తిపాడు మండలం ధర్మవరానికి చెందిన బుర్రా పండు, ఆమె ఆరేళ్ల కుమార్తె విజయదుర్గ బెండపూడిలో అక్క ఇంటికి శుక్రవారం ఉదయం వచ్చారు. సాయంత్రం ఇద్దరు కలిసి ధర్మవరం వెళ్లేందుకు బయలుదేరారు. కాగా ధర్మవరంలో ఇంటికి చేరలేదని కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందడంతో పలు ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీనిపై ఆమె బావ పడాల శివ పోలీసులకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పాండురంగ తెలిపారు. కాగా తల్లీకూతుళ్లు బెండపూడి జంక్షన్‌లో అన్నవరం వైపు వెళ్లే ఆటో ఎక్కినట్టు సీసీ ఫుటేజీలో రికార్డు అయ్యిందని చెప్పారు.

రెండు బైకులు ఢీ: వ్యక్తి మృతి

తొండంగి: మండలంలోని అన్నయ్యపేట బీచ్‌రోడ్డుపై శనివారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ...ఒంటిమామిడికి చెందిన దారబాల రాజు(18) తన బంధువును బైకుపై ఎక్కించుకుని వేమవరం సమీపంలో హేచరీ వద్ద దింపి తిరిగి స్వగ్రామం ఒంటిమామిడి బయలుదేరాడు. బీచ్‌రోడ్డులో అన్నయ్యపేట వద్దకు వచ్చే సరికి ఒంటిమామిడి వైపు నుంచి గరికిన రాజు బుల్లెట్ బైకుపై వస్తున్నాడు. వీరిద్దరి బైకులు ఎదురెదురుగా ఢీకున్నాయి. ఈ సంఘటనలో రాజు తలకు తీవ్రగాయాలవ్వగా అపస్మారక స్థితిలో ఉన్నాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. అలాగే గరికిన రాజుకు కూడా తీవ్రగాయాలవ్వడంతో వైద్యం పొందుతున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక హెచ్‌సీ పాండురంగ తెలిపారు.

సంపద సృష్టితో పంచాయతీలకు ఆదాయం

- పెద్దాపురం డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి
- తడి, పొడి చెత్తల నిర్వహణపై అవగాహన

తుని రూరల్: చెత్త నుంచి సంపద తయారీపై గ్రామీణ మహిళలు చైతన్యవంతం కావాలని పెద్దాపురం డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి సూచించారు. రెండు రోజుల కార్యక్రమాల్లో భాగంగా మొదట రోజు శనివారం ఎస్.అన్నవరం, చేపూరు పంచాయతీల్లో ఇంటింటా ఆమె పర్యటించి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టిస్తే పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. ఇందుకు ప్రతి మహిళా పంచాయతీ సిబ్బందికి సహకరించాలన్నారు. మహిళలు చైతన్యవంతులైతే ఆర్థిక ప్రగతి పరుగులు తీస్తుందన్నారు. గ్రామాల్లో సేకరించే చెత్త మొత్తాన్ని తడి, పొడి చెత్తగా విభజించి చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలకు తరలించడంపై మహిళలకు సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని పంచాయతీల్లో ఇంటింటా పర్యటన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రేఖవానిపాలెం, తేటగుంట, వి.కొత్తూరు, డి.పోలవరం, హంసవరం, తదితర గ్రామాల్లో ఈఓపీఆర్డీ జి.మరిడియ్య ఆధ్వర్యంలో ఇంటింటా చెత్త సేకరణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యదర్శులు టీవీవీ సత్యనారాయణ, నాగన్నదొర, రాజబాబు, ఎం.వీరలక్ష్మి పాల్గొన్నారు.


ఎస్.అన్నవరం తడి, పొడి చెత్తలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గండేపల్లి: తడి, పొడి చెత్తలను వేరు చేయడంపై జిల్లా పంచాయతీ అధికారి వి.రవి కుమార్ సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. మండలంలోని మురారి, గండేపల్లి, మల్లేపల్లి పంచాయితీల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. కేంద్రాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. శని, ఆదివారాల్లో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి ప్రజలకు తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వర్మి కంపోస్టు తయారు చేయడంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, ఏఓ చంద్రశేఖర్, కార్యదర్శి పీవీ శిరీష, సిబ్బంది ఉన్నారు.


మురారిలో శానిటేషన్‌పై సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా అధికారి రవికుమార్

ప్రత్తిపాడు: గ్రామంలో జరుగుతున్న స్వచ్ఛ ఆంధ్రా–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) వి.రవికుమార్ శనివారం పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం గ్రామంలో లేకపోవడాన్ని సిబ్బంది డీపీఓ దృష్టికి తీసుకువచ్చారు. వర్మీ కంపోస్ట్ షెడ్డుకు స్థలం కేటాయించాలని జిల్లా అధికారులకు లేఖ రాయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఘనంగా లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షులు బాలగంగాధరరావు దంపతులు

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేట సాయి బాలాజీ ఫంక్షన్ హాలులో లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎంఎస్ బాలగంగాధరరావు అధ్యక్షతన జరిగిన వేడుకలకు క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ సుభాష్ బాబు, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్ కుమార్, ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు, సెకండ్ వైస్ డిస్టిక్ గవర్నర్ చిట్టినీడి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత 50 సంవత్సరాల లయన్స్ క్లబ్ జెండాను, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ 1975 ఫిబ్రవరి 22న ప్రారంభమైన లయన్స్ క్లబ్ 50 ఏళ్లుగా పేద ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తుందని కొనియాడరు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కాన్ఫరెన్స్ కమిటీ చైర్మన్ కొత్త కొండబాబు, సెక్రటరీ లైన్ డాక్టర్ పద్మావతి, ట్రెజరర్ లైన్ సీహెచ్ జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.